ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌టీయూ నేతలు

మల్లాపూర్: ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ కార్మికులు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ రోడ్ల విస్తరణ, ఆటోస్టాండ్ తదితర సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, కాప్రా డివిజన్ అధ్యక్షుడు రామాంజనేయులు, రమేష్, నరేష్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీతారాముయాదవ్

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని న్యూ వేంకటేశ్వరనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రణాళికాబద్ధంగా నెరవేర్చుతాననన్నారు. ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. నాయకులు మేకల రాముయాదవ్, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. సీతాల వీరాస్వామి, ఉపేందర్, యాకుబ్‌పాషా, లక్ష్మణ్, గురువయ్య, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న పండితులు

అల్వాల్: మురళీకృష్ణ కాలనీలోని వాసవీకన్యకా పరమేశ్వరి సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం వైశాఖ శుద్ధ దశమి వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అల్వాల్ ఆధ్వర్యంలో అమ్మవారికి హోమం, అభిషేకం, కుంకుమార్చన, పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అల్వాల్, వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ కమిటీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

మేడ్చల్ మార్కెట్‌లో చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మేడ్చల్: మేడ్చల్ ప్రధాన మార్కెట్‌లోని రెండు దుకాణాల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మార్కెట్ లోని మనీష్ ట్రేడర్స్, అగర్వాల్ ట్రేడర్స్ షాపుల షెట్టర్లు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఒకదాని తర్వాత మరో షాపులోకి చొరబడి కౌంటర్‌లలో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు.మనీష్ ట్రేడర్స్ లో రూ.35 వేలు, అగర్వాల్ ట్రేడర్స్‌లో రూ.2 లక్షలు చోరీకి గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ సుధీర్ కృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మేడ్చల్ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పనులు పూర్తయ్యేదెన్నడో.. ?

● నిలిచిపోయిన ఇంకుడు గుంత నిర్మాణం ● వర్షాకాలం సమీపిస్తున్నా పూర్తికాని వైనం



ఉప్పల్ ఎలక్ట్రికల్ జంక్షన్ వద్ద నిలిచిన ఇంకుడు గుంత పనులు

ఉప్పల్: వరద నీటిని ఒడిసి పట్టాలి.. భూగర్భ జలాన్ని సంరక్షించుకోవాలి, రోడ్డుపై పారే మురుగును అరికట్టాలనే సంకల్పంతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో గతేడాది జూలైలో వరంగల్ జాతీయ రహదారిపై చేపట్టిన అత్యాధునిక ఇంకుడు గుంత (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్) నిర్మాణ పనులు ఏడాది గడుస్తున్నా.. పనులు పూర్తి కాలేదు.

◆ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వరంగల్ జాతీయ రహదారిపై గత దశాబ్ద కాలంగా కొద్దిగా వర్షం పడితే చాలు వరదంతా నదిలా.. ఉప్పల్ చౌరస్తా నుంచి వీటి కమాన్ వరకు జాతీయ రహదారిపై వరదనీరు నిలిచిపోతుంది. పర్యావసానంగా వర్షం పడినప్పుడల్లా రహదారి ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పలుసార్లు ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. వీటన్నింటికీ చెక్‌పెట్టేలా వరంగల్ జాతీయరహదారి ఉప్పల్ ఎలక్ట్రికల్ జంక్షన్ వద్ద రూ. 10 లక్షల(ఒక్కొక్కటి) తో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్‌ను నిర్మించాలని గతేడాది నిర్ణయించుకున్నారు. వెంటనే పనులను కాంప్రహెన్సివ్ రోడ్డు మెయింటెనెన్స్ ప్రోగామ్ (సీఆర్‌ఎంపీ) సంస్థకు అప్పగించారు. గతేడాది ఆగస్టు వర్షాకాలంలో ప్రారంభించిన పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడం శోచనీయం.

వర్షాకాలం రాకముందే పూర్తి చేయాలి..

కాంట్రాక్టర్‌కు గుర్తుకు వచ్చినప్పుడల్లా కొద్దిమేర పనులు పూర్తిచేసి వెళ్లిపోతున్నారని, చిత్తశుద్ధితో పనులను పూర్తి చేయాలనే ఆలోచన లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాకాలం రాకముందే పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకుడు గుంత నిర్మాణం ఇలా...

ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.1.10 కోట్లతో గుంత చుట్టూ కాంక్రీట్‌తో నిర్మాణం, పైనా సిమెంట్ స్లాబ్, భారీ వాహనాలు సైతం వెళ్లేలా నిర్మించారు. గుంత కింది భాగంలో పూర్తిగా మట్టీ ఉంటుంది. వరదనీరు నేరుగా ప్లాంట్‌లోకి అమర్చిన పైపుల ద్వారా ఇంకుడు గుంతలోకి చేరుకుంటుంది. తద్వారా వరదనీరు పూర్తిగా భూమిలోకి ఇంకుతుంది. అధికంగా వరద వస్తే ప్రత్యేకంగా అమర్చిన పైపుల ద్వారా బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. మరీ ఎక్కువైతే గుంతలో అమర్చిన మోటార్ల ద్వారా నీటిని తోడేసే ఏర్పాట్లు కూడా చేశారు. ఫలితంగా వరంగర్ జాతీయ రహదారిపైకి వచ్చే వరదనీరు పూర్తిగా ఇంకుడు గుంతలోకి చేరుతుంది. భూగర్భ జలాలు రీచార్జ్ అవుతాయి. రోడ్ల మీదకు నీరు రాదు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగదు.

మహానగరంలో 3–4 ప్రాంతాల్లో ఈ తరహా ప్లాంట్లు

వరద నీటిని ఒడిసి పట్టడంతో పాటు భూమిలోకి ఇంకించే విధానం, వరదనీరు రోడ్లపైకి రాకుండా ఉండేలా ఇంకుడు గుంతల నిర్మాణం కేవలం నగరంలో 3–4 ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఖైరతాబాద్, ఎల్‌బీనగర్, ఉప్పల్‌లో మాత్రమే ఈ తరహా నిర్మాణాలు చేపట్టారు.

పనుల జాప్యంపై చర్యలు తీసుకుంటాం



వర్షాకాలం రాకముందే నిలిచిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకుంటాం. అసంపూర్తిగా ఉన్న రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ పిట్ పనులతో పాటు ఇంకుడు గుంత పనులను సకాలంలో పూర్తి చేసి, పనుల జాప్యంపై ఆరా తీస్తాం.

– అంజనేయులు, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్

వ్యవసాయ అధికారుల తనిఖీలు



విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

మల్లాపూర్: నాచారంలోని శ్రీకర బయోటెక్, ఎల్డోరాడో సీడ్ కంపెనీలో వ్యవసాయశాఖ, పోలీస్, సీడ్ సర్టిఫికేషన్ అధికారులు తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్రం నుంచి పలు జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు విత్తనాలు పంపిణీ జరుగుతుంది. ఈ నేపథ్యంలో సీడ్ స్టాక్, విత్తనాల నాణ్యతపై తనిఖీలు చేపట్టారు. విత్తనాల ప్రాసెసింగ్ ప్లాంట్‌లోని వరి విత్తనాలు, మొక్కజొన్న విత్తనాల ప్రాసెసింగ్, ప్యాకింగ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట్రామిరెడ్డి, ఉప్పల్ వ్యవసాయాధికారి, కృపాకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, విత్తర ధ్రువీకరణ అధికారి పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మోత్సవ వేడుకలను శ్రీవాసవి ఆర్య వైశ్య సంఘం నాచారం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌లు హాజరయ్యారు. అనంతరం కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. వాసవి ఆర్యవైశ్యసంఘం గౌరవ అధ్యక్షుడు నరసింహ, అధ్యక్షుడు శ్రీరామ్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి భాస్కర్, మహేశ్వరమూర్తిలింగం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో నూతనంగా ప్రారంభించిన సీసీరోడ్డు పనులను బుధవారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, కాంగ్రెస్ నేతలు ఆదినారాయణగౌడ్, సురేష్‌చారి, రవీందర్‌గౌడ్, విజయ్, యాదగిరి, రఘు, నరసింహగౌడ్, షకీల్, మతిన్, సుధాకర్, సాయి తదితరులున్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో టెలికాం కాలనీవాసులు

అల్వాల్: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని వెంకటాపురం డివిజన్ టెలికాం కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. బుధవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ పార్కులో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల్లో భాగంగా గది నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ ప్రతినిధులు కుముదాదేవి, పిల్లి సంజయ్‌కిరణ్, జగన్నాథ్‌రెడ్డి, డీఎస్ రావు, బర్మాచారి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్. సురేష్ తదితరులున్నారు.

మల్లారెడ్డి కళాశాలలో డ్రోన్ వర్క్ షాప్



డ్రోన్ ను పరిశీలిస్తున్న మల్లారెడ్డి కళాశాల విద్యార్థులు

మేడ్చల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం డ్రోన్ వర్క్ షాప్ నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్ షాప్ బుధవారం ముగిసింది. వివిధ సంస్థల ప్రతినిధులు విద్యార్థులకు డ్రోన్‌లపై అవగాహన కల్పించారు. డ్రోన్‌లు వ్యవసాయం, పర్యవేక్షణ, రవాణా తదితర రంగాల్లో ఎలా ఉపయోగపడుతున్నాయో వివరించారు. బీఎల్‌డీసీ మోటార్, ప్రొపెల్లాఆర్, ఫైలెట్ కంట్రోల్స్, లిథియం బ్యాటరీ టెక్నాలజీ, వంటి అంశాలపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్‌జె సాఫ్ట్ టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు శివప్రకాష్, సమీర్ విద్యార్థులు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, హెచ్‌ఓడీ డాక్టర్ సంపత్ కుమార్,కో ఆర్డినేటర్లు మాల్యాద్రి, రామకృష్ణన, నిహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఉప్పల్ బీరప్పగడ్డ ప్రాంతానికి చెందిన సుబ్బయ్యకు ఇద్దరు కుమారులు. కాగా పెద్ద కుమారుడు ప్రదీప్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉండటంతో అతడిని ఆస్పత్రిలో చేర్పించారు. కుమారుడి బాగోగులు చూసేందుకు తల్లి సువర్ణ రోజూ అసుపత్రికి వెళ్లొచ్చేది. చిన్న కుమారుడు ప్రవీణ్‌కుమార్(18) ఇంట్లోనే ఉండే వాడు. తల్లి బుధవారం ఉదయం ఆసుపత్రి నుంచి ఇంటికి రాగా లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఎంత తట్టినా తలుపులు తెరవకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు తీసి చూడగా.. అప్పటికే ప్రవీణ్ అనుమానాస్పద స్థితిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చర్లపల్లి టెర్మినల్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కాప్రా: చర్లపల్లి రైల్వేస్టేషన్ టెర్మినల్‌లో నిర్మించిన కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్. బోస్ డిమాండ్ చేశారు. బుధవారం చర్లపల్లి శాటిలైట్ రైల్వే టెర్మినల్ ప్రధాన ముఖద్వారం వద్ద సీపీఐ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కోట్లాది రూపాయలతో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన చర్లపల్లి శాటిలైట్ రైల్వే టెర్మినల్ ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా సీలింగ్ ఊడిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా నాయకులు దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యప్రసాద్, ప్రీతం, గిరి, యోగిత, శేఖర్‌రాజ్ కుమార్, కౌశిక్, రాజేష్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

కాప్రా: మేడ్చల్ జిల్లా, కాప్రా సర్కిల్‌లోని ప్రభుత్వ ఆసుప్రతులను సీపీఎం పార్టీ నాయకులు సందర్శించారు. బుధవారం ఏఎస్‌రావు నగర్, మహేష్‌నగర్‌లోని బస్తీ దవాఖానాలతో పాటు జమ్మిగడ్డలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైనా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం, కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, గణేష్, వెంకట్, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఘట్‌కేసర్: పనికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ బాలాజీనగర్‌కు చెందిన శ్రీను (55) వెల్డర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 2న పనికి వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. అతడికి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. అతడి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. అతడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాన్నారు.

వైభవంగా నిమిషాంబదేవి అవతరణోత్సవాలు



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని నిమిషాంబదేవి అవతరణ మహోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఉదయం 5 గంటలకు పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, విశేష అలంకరణ, పంచహారతి, నీరాజనం, మంత్ర పుష్పం, 9 గంటలకు సామూహిక చండీహోమం, 10 గంటల నుంచి మహిళలచే సామూహిక కుంకుమార్చనలు, 12 గంటలకు అన్నప్రసాదం, భోజన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని వినతి



వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్ : డివిజన్ పరిధి రాజేంద్రనగర్, నేతాజీనగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ శ్రీవాణి మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించి బస్తీ దవాఖానా ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బస్తీ దవాఖాన ఏర్పాటుకు రాజేంద్రనగర్‌లో అన్ని వసతులతో నిర్మాణం పూర్తైన భవనం అందుబాటులో ఉందన్నారు. బీజేపీ నేతలు నారాయణదాసు, కుమార్‌స్వామి, నరసింహ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు





స్వామివారి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్ : శ్రీనివాసపురంలోని మాత గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన స్వామివారి 332వ ఆరాధన ఉత్సవాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీరబ్రహ్మేంద్రస్వామి సాక్షాత్తు భగవంతుని స్వరూపమని, ఆ కాలంలోనే భవిష్యత్తులో జరగబోయే విషయాలను తెలియజేసిన మహాకాలజ్ఞానస్వరూపులన్నారు. ఆయనను ఆరాధిస్తే జ్ఞానంతో పాటు అన్నీ శుభాలే జరుగుతాయన్నారు. ఆలయ అధ్యక్షుడు రామస్వామిచారి, ప్రధాన కార్యదర్శి ఆచారి, కోశాధికారి నరసింహచారి, ఉపాధ్యక్షుడు సిద్ధి రాములుచారి, అశోక్‌చారి, రామోజు నరసింహచారి, సంయుక్త కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

కాప్రా: విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన మహోత్సవాలను మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ తిరుమల్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, కాప్రా సర్కిల్ విశ్వ బ్రాహ్మణ సంఘం చైర్మన్ లక్ష్మీనారాయణ, అధ్యక్షులు మల్లికార్జునచారి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' విజయంపై సంబురాలు



మల్కాజిగిరి చౌరస్తాలో బీజేపీ నేతల సంబరాలు

మల్కాజిగిరి: భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై మల్కాజిగిరిలో బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. కార్పొరేటర్ శ్రవణ్, సీనియర్ నాయకుడు నాగరాజులు మాట్లాడుతూ.. భారతదేశ సత్తా ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ఎక్కడున్నా వారికి తగినరీతిలో బుద్ధి చెప్పడం భారతదేశ రక్షణ దళాలకు తెలుసునన్నారు. ఇప్పటికైనా పాకిస్తాన్ తన వైఖరిని మార్చుకోవాలన్నారు. సునీల్‌యాదవ్, హరి, వేణుయాదవ్, సాయి, రమేష్, శంకర్, ప్రేమ్, నర్సింహ పాల్గొన్నారు.

మల్లాపూర్: ఆపరేషన్ సిందూర్‌పై మల్లాపూర్, నాచారంలో బీజేపీ నేతలు, స్థానిక నేతలు పార్టీలకు అతీతంగా సంబరాలు నిర్వహించుకున్నారు. 'భారత్ మాతాకీ జై'.. అంటూ నినాదాలు చేశారు. మల్లాపూర్ డివిజన్ మాజీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, మల్కా ప్రకాష్, లక్ష్మారెడ్డి, అమరేందర్‌రావు, క్రాంతికుమార్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణ, ప్రకాష్‌యాదవ్, నరేష్ తదితరులున్నారు.

ఘనంగా వాసవీమాత జన్మోత్సవ వేడుకలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



ఉప్పల్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

రామంతాపూర్ : వెంకట్‌రెడ్డినగర్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని 108 లీటర్ల పాలు, పంచామృతంతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, నామస్మరణ, మంత్రపుష్పం, అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మేడ్చల్ జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు శంభు పాండయ్య, ఆలయ అధ్యక్షుడు భువనగిరి శ్రీనివాస్, బీజేపీ అధ్యక్షుడు వంగాల సంతోష్‌గుప్తా, కొత్తపల్లి రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: వాసవీ కన్యకాపరమేశ్వరి కారణజన్మురాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మోత్సవ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మాభిమానం, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. సంఘం ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కీసర: భూ భారతి పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి అన్నారు. భూ భారతిలో భాగంగా బుధవారం కీసర మండలం చీర్యాల గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కీసరలో 243, చీర్యాలలో 107, మొత్తంగా 350 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి

ఘట్‌కేసర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని, అధికారులు స్పందించి అన్నదాతలకు మద్దతు ధర చెల్లించాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయకుండా దళారులకు మేలు జరిగేలా వారికే అమ్ముకునేలా అధికారులు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. రైతుసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే అన్నదాతలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.